క్లుప్తంగా

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

ఖమ్మంగాంధీచౌక్: వైద్య విద్యలో సీటు సాధించిన ఖమ్మం నగరానికి చెందిన మౌనిక, సాయి ప్రియ అనే ఇద్దరు విద్యార్థినులకు పుస్తకాల కొనుగోలు కోసం శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం యూనిట్ ఆధ్వర్యాన రూ. 11 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కృష్ణారెడ్డి, హనుమంతరావు, జనార్దన్‌రావు, డీపీసీ రావు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో మాన్వి ప్రతిభ


సర్టిఫికెట్‌తో మాన్వి

ఖమ్మంఅర్బన్: మమత డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ అనితరావు దంపతుల కుమార్తె చిన్నారి మాన్వి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ముచ్చింతలలో శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి వారి సారథ్యంలో ఆశ్రమంలో ఆస్థాన నాట్యాచార్యులైన ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యాన ఈనెల 15 నుంచి 23 వరకు కళా ప్రదర్శలు నిర్వహించారు. దీంతో శనివారం మాన్వి తన నృత్య ప్రదర్శనతో అవార్డు అందుకోవడంతో పాటు కళాకారులు, భక్తుల అభినందనలు పొందింది.

54 మంది బైండోవర్

కూసుమంచి: ఎన్నికల నియమావళిలో భాగంగా శనివారం వివిధ గ్రామాలకు చెందిన 54 మందిని తహసీల్దారు సంపత్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజాపంథా ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ప్రజాపంథా నాయకులు

ఖమ్మంరూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని, ఈ దాడులను కేంద్ర ప్రభుత్వం సమర్థించడాన్ని ఖండించాలని ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య తెలిపారు. శనివారం మండలంలోని కాచిరాజుగూడెంలో ప్రజాపంథా ఆధ్వర్యాన ర్యాలీ తీశాక మోదీ, అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమెరికా అండతో ఇండియా సమర్థింపుతో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ బాంబింగ్ చేసి మారణకాండకు పాల్పడడం, వేల మంది పిల్లలు, వృద్ధులు, మహిళలను హతమార్చడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. తక్షణమే దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఎం.మల్లయ్య, పి.శ్రీనివాసరావు, గుడిచుట్టు మాధవరావు, రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిపై వ్యాఖ్యలు అర్ధ రహితం


మాట్లాడుతున్న పీర్యా నాయక్

కూసుమంచి: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో–కన్వీనర్‌పై కొందరు బీఆర్ఎస్ గిరిజన నాయకులు చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ పీర్యా నాయక్, గిరిజన సంఘం నాయకుడు బానోత్ బాసూ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ వి. సేత్రాం నాయక్ అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూసుమంచి ఎంపీపీ శ్రీనివాస్‌నాయక్‌తో పాటు ఇతర నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమై పొంగులేటిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎవరెన్ని కుట్రలు చేసినా గిరిజనుల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు గిరిజనుల మధ్యరాజకీయ చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోత్ లచ్చా నాయక్, బాబు నాయక్, మంచ్యా నాయక్, కిషన్ నాయక్, సామా నాయక్, సైదులు నాయక్, వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	లియో
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	భగవంత్ కేసరి
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	టైగర్, భగవంత్ కేసరి
సుందర్	గణపత్

– ఖమ్మంగాంధీచౌక్

ప్రతీ ఊరిలో పూలకళ..!

నేటి సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం

- పూల పండుగకు ఎల్లలు దాటి వస్తున్న మహిళలు
- పూలకు రంగులు అద్ది విక్రయిస్తున్న విక్రయదారులు
- నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం


బతుకమ్మలను పేర్చుతున్న మహిళలు (ఫైల్)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుగొమ్మగా నిలిచిన బతుకమ్మ ఉత్సవాల్లో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ నేడు జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా జరగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం సద్దుల బతుకమ్మ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక ప్రతీ ఊరిలోనూ పూల పండుగ సంబరాలు అంబరాన్ని తాకింది. రోడ్లన్నీ తంగేడు, గునుగు, కట్ల పూలతో నిండిపోయాయి. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబరాలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మలను పూలతో పేర్చి ఆట,పాటలతో సందడి చేయగా నేడు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.

ఐదు రకాల నైవేద్యాలు..

బతుకమ్మ సంబరాల్లో ప్రతిరోజు నైవేద్యాల సమర్పన ఉన్నప్పటికీ సద్దుల బతుకమ్మ రోజున మాత్రం పెరుగన్నం, చింతపండు పులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం అనే ఐదు రకాల నైవేద్యాలను తయారు చేస్తారు. బతుకమ్మను కొలుస్తూ పూలతో పాటు నైవేద్యాలను సమర్పించటం సంప్రదాయం.

అధిక ప్రాధాన్యమైన పండుగ..

బతుకమ్మ వేడుకల్లో భాగంగా చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దొరికినన్ని పూలతో బతుకమ్మను పెద్దగా పేరుస్తారు. పెద్ద బతుకమ్మ పక్కన చిన్నగా గౌరమ్మను పసుపుతో తయారు చేస్తారు. గౌరమ్మను పూజించిన తరువాత, ఆ పసుపును తీసి ఆడవారు వారి చెంపలకు రాసుకుంటారు. అమ్మవారికి ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. బతుకమ్మ మీద కొలువైన గౌరమ్మను గంగమ్మ ఒడిలో వదిలిపెట్టి మళ్లీ ఏడాది వరకు బతుకమ్మ కోసం ఎదురుచూస్తారు.

ఎక్కడ చూసినా పూల సందడే...

బతుకమ్మ పండుగలో ప్రధానమైనవి పూలు కావడంతో శనివారం నుంచే మహిళలు తంగేడు, గునుగు, తామర, టేకు పూల సేకరణలో నిమగ్నమయ్యారు. కొందరు గ్రామీణ ప్రాంతాల వారు అడవుల నుంచి పూలను సేకరిస్తుండగా.. మరికొందరు కారేపల్లి, కామేపల్లి, ఇల్లెందు, ఏన్కూరు, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల తదితర ప్రాంతాల నుంచి బంతి, ఇతర రకాల పూలను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. బతుకమ్మను పేర్చడంలో తంగేడు పూలు తప్పనిసరి కావడంతో 5 కట్టల పూలు రూ.100ల చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే గునుగు, టేకు వంటి పూలు 10 కట్టలు రూ. 100, బంతి, సీతజడ పూలు కిలో రూ.100 చొప్పున అమ్ముతున్నారు. బారీ బతుకమ్మలను పేర్చడం కోసం మేదర బుట్టలు అవసరముండడంతో సైజును బట్టి రూ. 100 నుంచి రూ. 500ల వరకు విక్రయిస్తున్నారు.



తంగేడు, సీతజడ పూల విక్రయాలు


పూలకు రంగులేసి విక్రయం


విక్రయానికి సిద్ధంగా ఉన్న బతుకమ్మ బుట్టలు

ఖమ్మంగాంధీచౌక్: బతుకమ్మ వేడుకలను పుట్టింటిలో జరుపుకోవటం అనాదిగా ఉంటుండడంతో కొందరు ఏ ప్రాంతంలో ఉన్నా.. పండుగ కోసం పుట్టింటికి వచ్చి దసరాతో కలుపుకొని స్నేహితులు, బంధువులతో 10 రోజుల పాటు సందడిగా గడుపుతారు. ప్రతీ రోజు సాయంత్రం బతుకమ్మల వద్ద బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్స్, కోలాటాలతో ఆటపాటలతో సందడి చేస్తుండగా.. సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు అంతా సిద్ధమవుతున్నారు.

వైభవంగా జరుపుకుంటాం..



బతుకమ్మ పండగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఎంతో వైభవంగా జరుపుకుంటాం. మహిళలమంతా సంప్రదాయ పద్ధతుల్లో సద్దుల బతుకమ్మ రోజున ఘనంగా వీడ్కోలు పలుకుతాం. మళ్లీ రావమ్మ అని పాడుతూ బతుకమ్మను కొలుస్తాం.

– విజయ, కాల్వొడ్డు, ఖమ్మం

పూలు సేకరిస్తున్నాం..



సద్దుల బతుకమ్మ కోసం పూలను సేకరించే పనిలో ఉన్నాం. ప్రతి ఏటా సద్దుల బతుకమ్మ రోజున పెద్ద బతుకమ్మను పేర్చటం ఆనవాయితీ కావడంతో ఈ ఏడాది కూడా పెద్ద బతుకమ్మను పేర్చడానికి సన్నద్ధం అవుతున్నాం.

– అనుమోలు హైమావతి, దాబాలబజార్, ఖమ్మం

రంగులు అద్ది విక్రయిస్తున్నాం..



సద్దుల బతుకమ్మకు పూలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో మా కుటుంబంలోని ముగ్గరం పూలను సేకరించి విక్రయిస్తున్నాం.తంగేడు, గునుగు, టేకు వంటి పూలకు రంగులు అద్ది అమ్ముతున్నాం. ఒక్కొక్కరికి రూ.వెయ్యి వస్తాయని ఆశిస్తున్నాం.

– పట్టు కాంతి, జోగ్గూడెం, కారేపల్లి మండలం

సీ–విజిల్ యాప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న అంతర్ జిల్లా చెక్‌పోస్టును మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీని, వాహనాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించి పకడ్బందీగా వాహన తనిఖీలు చేపట్టాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తిరుమలాయపాలెం పోలింగ్ బూత్ వద్ద యువతకు సీ–విజిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ఏమైన ప్రలోభాలు, డబ్బు, మద్యం సరఫరాపై ఫిర్యాదులు చేయొచ్చని సూచించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాలకు రాలేని 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు పోస్టల్ బ్యాలట్ కోసం బీఎల్‌ఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలని, వికలాంగులు తప్పకుండా సదరన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులపై విచారణ జరిపి పోస్టల్ బ్యాలెట్ ఇస్తామని, ఎన్నికలు సజావుగా జరిగే విధంగా ఓటర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వీరయ్య, సాధిక్, బీఎల్‌ఓలు శ్రీనివాస్, గీత తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ బల్బులపై విస్తృత ప్రచారం

నేలకొండపల్లి: గృహ వినియోగదారులు ఎల్‌ఈడీ బల్బులు వినియోగించి విద్యుత్‌ను ఆదా చేయాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులు శనివారం ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి ఏఈ కార్యాలయం వద్ద బల్బులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఎల్‌ఈడీ బల్బుల ప్రయోజనాలను విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు వివరించారు. బల్బులు కావాల్సిన వారు మూడు నెలల క్రితం నాటి విద్యుత్ బిల్లులను చూపించి పొందొచ్చునని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ సిబ్బంది, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

నగరంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీ.పీ. గౌతమ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని బతుకమ్మల వద్ద పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో కోలాటం ఆడి సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం సహకారనగర్: బతుకమ్మల వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్


ఖమ్మంగాంధీచౌక్: విద్యుత్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయం ఆవరణలో వేడుకలు

‘గోర్ బంజారా క్రాంతి సంఘ్’ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంరాపర్తినగర్: రాష్ట్రీయ ఘుమంతు జన్ జాతి మోర్చా, మౌర్య క్రాంతి సంఘ్, రాష్ట్రీయ గోర్ బంజారా క్రాంతి సంఘ్ రెండో జాతీయ సంయుక్త సమావేశాలను పురస్కరించుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ షేక్.నజీమా, కో– కన్వీనర్లు ఉపేంద్ర బాయి, బానోత్ బద్రునాయక్, జి.నరేంద్ర మాట్లాడుతూ.. ఈనెల 29న హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ , నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో నిర్వహించనున్న రెండో జాతీయ సంయుక్త సమావేశాలను మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ ఎ.సీతారాం నాయక్ ప్రారంభించనున్నారని తెలిపారు. బాం సేఫ్, భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్ మేశ్రామ్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశాలకు లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రామ్ నాయక్, ఘుమంతు జన్ జాతి మోర్చా జాతీయ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌మానే, జీబీడబ్ల్యూఎస్ గౌరవ అధ్యక్షుడు జీవన్‌లాల్ లావుడియాలతో పాటు మరెందరో ప్రముఖులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆదివాసులు, గిరిజన లంబాడీలు, దళిత వర్గాలతో పాటు ఇతరులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కో కన్వీనర్ అబ్దుల్ రెహమాన్, జంగిపల్లి రవి, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు జంపా, రవీందర్, సురభి, శ్రీనివాస్, మురళి, సతీష్, సురేష్, ఐక్యవేదిక నాయకులు అఖిల్, ప్రసాద్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనమే..


కూసుమంచి: కాంగ్రెస్‌లో చేరిన లక్ష్మీకాంతమ్మతో ప్రసాదరెడ్డి, నాయకులు

కూసుమంచి/ఖమ్మంరూరల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కూసుమంచిలో కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన తర్వాత గట్టుసింగారం గ్రామంలో సీనియర్ నాయకురాలు వెల్లంపల్లి లక్ష్మీ కాంతమ్మకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. జక్కేపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొని ఆరు గ్యారెంటీ స్కీంలను వివరించారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లిలో ఓ వివాహ వేడుకకు హాజరవ్వడంతో పాటు నాయుడుపేటలో అమ్మవారి మండపం వద్ద అన్నదానాన్ని ప్రారంభించారు. అలాగే తల్లంపాడులో స్వాతంత్ర్య సమరయోధుడు మల్లీడి వీరయ్యను, రామన్నపేటలో టీవీ మెకానిక్ ఎస్.యాకూబ్‌ను, తాటికొండ అంజయ్య కుటుంబాలను కలిశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, నాయకులు హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, కొరివి వెంకటరత్నం, సర్పంచ్ నెల్లూరి ఖాదర్ బాబు, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, రాంరెడ్డి, వీరభద్రం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక..

దానవాయిగూడెం, జాన్‌బాద్‌తండా, కామంచికల్, పడమటితండాలకు చెందిన 72మంది ఆటో కార్మికులు ప్రసాద్‌రెడ్డి సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి సంఘం జెండా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం. వెంకటరెడ్డి, ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు గురవయ్య, దుర్గ, సత్తి, బిందు, ఉమ, కార్యదర్శి ఉపేందర్, హరినాధబాబు తదితరులు పాల్గొన్నారు.

తులిసమ్మకు పలువురి నివాళి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ సరిపుడి రమాసతీష్ నాయనమ్మ 10వ డివిజన్ చైతన్యనగర్‌కు చెందిన సరిపూడి తులిశమ్మ(96) శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు తులిశమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చావా నారాయణరావు, పొట్ల వీరేందర్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, పగడాల నాగరాజు, జాబిశెట్టి శ్రీనివాసరావు తదితరులు కుటుంబసభ్యులను ఓదార్చారు.

పలువురిని పరామర్శించిన ఎంపీ నామా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఇటీవల మృతి చెందిన నల్లమోతు పూర్ణచంద్రరావు సతీమణి లలిత దశదిన కర్మ కార్యక్రమాన్ని శనివారం హరిత గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వీడీవోస్ కాలనీకి చెందిన ఒద్దు నారాయణరెడ్డి కుమార్తె అనూష ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యులు చిత్తారు సింహాద్రి యాదవ్, నాయకులు గొడ్డేటి మాధవరావు, పాటిబండ్ల ప్రసాద్, నామా సేవా సమితి సభ్యులు పొల్సంచ రాజేష్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న పాపిట్ల సత్యనారాయణ

తిరుమలాయపాలెం: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం తిరుమలాయపాలెంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ, దళితులపై దాడులు, దౌర్జన్యాలపై డిసెంబర్ 4న ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని, సభపై దళిత వాడల్లో విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, నాగటి సురేష్, రాము, ఇజ్రాయిల్, పుట్టల ఉపేందర్, కొమ్ము నాగేశ్వరరావు, మట్టి దుర్గాప్రసాద్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలనను సాధించుకుందాం..



మాట్లాడుతున్న బానోత్ సునీత

కామేపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సంక్షేమ పాలనను తెలంగాణలో సాధించుకుందామని వైఎస్సార్‌టీపీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు బానోత్ సుజాత పేర్కొన్నారు. శనివారం కామేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణాలోని పేదలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వ ఖజానాను బీఆర్ఎస్ నాయకులు లూటీ చేశారన్నారు. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను ఆదరించి ఆశీర్వదించాలన్నారు. రాజశేఖరరెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు పాలన అందిస్తామని, ఇల్లెందు నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, దుర్గారెడ్డి, దొంతి శ్రీనివాసచారి, రాంమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అవతారంలో అమ్మవారు


కామేపల్లి: కోటమైసమ్మ తల్లి దేవాలయంలో దుర్గాదేవి అవతారంలో..


శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ సరస్వతీ దేవిగా..


శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో విజయలక్ష్మి అవతారంలో..


ఖమ్మంగాంధీచౌక్: జమ్మిబండపై ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా భక్తులు తమ మొక్కలను చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి మండపాల వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంలో మహాలక్ష్మి దేవి అలంకరణలో..


ఖమ్మం అర్బన్: 14 డివిజన్ మధురానగర్ సాయిమందిరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కూసుమంచిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీపిక


ఖమ్మంగాంధీచౌక్: శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


నేలకొండపల్లి: బైరవునిపల్లిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి


ఖమ్మంగాంధీచౌక్: శ్రీ సరస్వతీ దేవి అమ్మవారికి పూజలు చేస్తున్న విద్యార్థులు